


14న అనంతగిరి ప్రదక్షిణ

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక దశమి సందర్భంగా 14వ తేదీ ఉదయం 5.30గంటలకు వికారాబాద్‌లోని భవానీ మందిరం నుంచి పుష్కరిణి మీదుగా అనంతగిరి దేవాలయం వరకు గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. పాద యాత్ర హిందూ జనశక్తి సంస్థ ఆధ్వర్యంలో సర్వతోముఖయాజులు శ్రీశ్రీశ్రీ బాలమార్తండ మహారాజ్ మార్గదర్శనంలో జరుగుతుందన్నారు. కేరళ్లి వద్ద ఉదయం 9 గంటలకు టిఫిన్, మధ్యాహ్నం 12.30 గంటలకు బుగ్గా రామలింగేశ్వరాలయం వద్ద భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

అందెశ్రీకి

కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో ఘట్‌కేసర్‌లో ముగిసిన అంత్యక్రియలు





అందెశ్రీ అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజాప్రతినిధులు

- కవులు, కళాకారుల ఆటపాటలతో నివాళి
- హాజరైన సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- శోకసంద్రంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వాసులు
- కలెక్టర్ మను చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- పోలీసుల భారీ బందోబస్తు

సహజ కవి, ప్రముఖ రచయిత అందెశ్రీ.. తాను ఎంతో ఇష్టంతో నిర్మించుకుంటున్న ఇంటిని సందర్శించి 24 గంటలు గడవక ముందే అక్కడికి శవమై తిరిగి రావడాన్ని స్థానికులు ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో మంగళవారం నిర్వహించిన ఆయన అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, కవులు, కళాకారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. అంతిమ యాత్రలో ఆయన అభిమానులు 'అందెశ్రీ అమర్‌రహే' అంటూ నినాదాలు చేశారు.



అంతిమ యాత్రలో మంత్రులు జూపల్లి, లక్ష్మణ్

ఘట్‌కేసర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం యావత్ రాష్ట్రాన్ని శోకసంద్రంలో ముంచేసింది. అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన తిరిగి రాని లోకాలకు వెళ్లాడన్న నిజాన్ని జిల్లా ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. పాత వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామం రేబర్తిలో జన్మించిన ఆయన అనేక కష్టనష్టాల కోర్చి జనం గుండెల్లో నిలిచిపోయే విధంగా అనేక గేయాలు, పాటలు రచించి, అందరి మనసులు చూరగొన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తి తమ మధ్యలో లేకపోవడం ఆయన అభిమానులను కలిచివేసింది. ఘట్‌కేసర్‌లోని

మిగతా 7వ పేజీలో...

కడసారి చూపునకు తరలివచ్చి..

ఎన్ఎఫ్‌సీ నగర్ నుంచి ఘట్‌కేసర్ అవుటర్ జంక్షన్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన మంగళవారం నిర్వహించిన అంత్యక్రియలకు జిల్లాలోని కవులు, కళాకారులతో పాటు పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, ఆయన అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో కడసారి చూపుకోసం తరలివచ్చారు. ఆయన అంత్యక్రియలు ఘట్‌కేసర్‌లో నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించిన వెంటనే కలెక్టర్ మను చౌదరి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సోమవారం సాయంత్రం నుంచే ఏర్పాట్లను ప్రారంభించి తెల్లవారేసరికి పూర్తి చేశారు. ప్రధానంగా రోడ్లకు ఇరువైపుల చదును చేయటంతో పాటు పలుచోట్ల గుంతలను పూడ్చారు. తీవ్రమైన చలిని సైతం లెక్క చేయకుండా రాత్రికి రాత్రే సిబ్బంది చేసిన శ్రమను పలువురు అభినందించారు.



అందెశ్రీ అంతిమ యాత్రలో కళాకారుల ఆటాపాట



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేని వాహనాలను తప్పని సరిగా సీజ్ చేయాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇసుక రవాణాపై సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌వో మంగీలాల్, ఏడీమైన్స్ సత్యనారాయణ, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఇరిగేషన్ ఈఈ అశోక్, గ్రౌండ్ వాటర్ అధికారి రవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఖోఖో రాష్ట్ర స్థాయి టోర్నీ విజేత 'రంగారెడ్డి'

పురుషుల జట్టు ప్రథమం, మహిళల జట్టు ద్వితీయ స్థానం

రికార్డు నెలకొల్పిన ఆటగాళ్లు

7

మక్కలకు ఆన్‌లైన్ తిప్పలు



- ఆన్‌లైన్‌లో నమోదు కాని పంట విస్తీర్ణం
- వివరాలు లేవని కొనుగోళ్లకు నిరాకరణ
- కనీస మద్దతు ధర అందక రైతుల గగ్గోలు
- దిక్కులేక తక్కువ ధరకు విక్రయిస్తున్న వైనం
- జిల్లాలో 30 వేల మంది మొక్కజొన్న రైతులు

తాండూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులను ఆన్‌లైన్ తిప్పలు వెంటాడుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్‌ను పరిశీలించకుండా సాగు విస్తీర్ణం వివరాలు నమోదు చేయడంతో మక్క రైతులు కనీస మద్దతు ధరకు మక్కలను విక్రయించలేకపోతున్నారు. వీటి కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం ఈ ఏడాది మార్క్‌ఫెడ్‌కు అప్పగించింది. మార్క్‌ఫెడ్ డీసీఎంఎస్, సహకార సొసైటీల ద్వారా కమిషన్‌పై కొనుగోలు చేసేందుకు అప్పగించింది. తాండూరు, పరిగి, వికారాబాద్‌లో డీసీఎంఎస్ ద్వారా రైతుల నుంచి మక్కలు కొనుగోలు చేస్తుండగా జిల్లాలో సహకార సొసైటీల ద్వారా మక్కలు కొనుగోలు చేసేందుకు బాధ్యతలు అప్పగించింది.

75 వేల మెట్రిక్ టన్నుల అంచనా

రెండు రోజుల క్రితం తాండూరు డీసీఎంఎస్‌లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల మంది మక్క

మిగతా 8వ పేజీలో...

క్వింటాల్‌కు రూ.600 వ్యత్యాసం

ఇదిలా ఉంటే అక్టోబరు 30వ తేదీ వరకు వ్యవసాయశాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మక్క రైతుల నుంచి ఎకరాకు 25 క్వింటాళ్లకు మించకుండా మక్కలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. వ్యవసాయ అధికారులు సక్రమంగా రైతు వేదిక సెక్టార్ భవనంలో లేకపోవడం కొంత మంది రైతులు దరఖాస్తు చేసుకున్నా వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదు. దీంతో నేడు రైతులు మక్కలు విక్రయించేందుకు డీసీఎంఎస్‌కు వస్తే వారి పేర్లు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మక్కలు క్వింటాల్ ధర రూ.1,800 నుంచి రూ.1,900 ఉండగా కనీస మద్దతు ధర రూ.2,400 ఉండటంతో రైతులు మార్క్‌ఫెడ్‌కు అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, పక్కన కలెక్టర్ ప్రతీక్‌జైన్

విద్యతోనే సమాజం అభివృద్ధి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును మార్చగల శక్తి విద్యకు మాత్రమే ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మైనార్టీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ విద్య, మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ మాట్లాడుతూ అందరూ చదువుకోవాలనేది జాతీయ విద్యా దినోత్సవ లక్ష్యమన్నారు. విద్యతోనే దేశం, సమాజం కూడా అభివృద్ధి చెందుతాయనే లక్ష్యంతో అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి అనేక ఆధునిక సంస్కరణలు తీసుకువచ్చారని ఆయన తెలిపారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధికంగా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందుతుందన్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ వసతి గృహాలకు వంట సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాల పిల్లలు కలిసిమెలిసి చదువుకోవడానికి అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతీ నియోజకవర్గంలో రూ.200 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నైపుణ్యాన్ని పెంచుకోవాలి

వికారాబాద్‌లో గురుకుల పాఠశాలలకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు సూచిస్తూ నిర్మాణ పనులకు సంబంధించి నిధులను మంజూరు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకునే దిశగా కృషి చేయాలన్నారు. అంతకు ముందుగా నీట్, ఐఐటీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు సంబంధించిన ల్యాబ్‌లను స్పీకర్ ప్రారంభించారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమోంటోలను

మిగతా 8వ పేజీలో...

వణికిస్తున్న చలి

- రోజు రోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అత్యల్పంగా యాలాల్‌లో 12 డిగ్రీలు నమోదు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో చలి విజృంభిస్తోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాయంత్రం నుంచే చలిగాలుల ఉధృతి పెరగడంతో రాత్రిళ్లు జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రాత్రి పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తెల్లవారు జామున మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం వేళ మంచు రహదారులను కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్ జిల్లా యాలాల్‌లో 12 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మర్పల్లిలో 12.6 డిగ్రీలు, తాండూరు, బషీరాబాద్‌లలో 13.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి సెంట్రల్ యూనివర్సిటీలో 13.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చేవెళ్ల మండలం కందవాడలో 13.7 డిగ్రీలు, షాబాద్ మండలం తాళ్లపల్లిలో 13.8 డిగ్రీలు, చందన్వెల్లిలో 14.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియాలో 14.9 డిగ్రీలు, ఆల్వాల్‌లో 15 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు కూడా క్రమేపీ పడిపోతున్నాయి. మూడు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు అన్ని మండలాల్లో 28 నుంచి 30 డిగ్రీలలోపుగానే నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో చలి తీవ్రత ఇంకా మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మెథడిస్టు జాతర షురూ

ప్రారంభించిన హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ బిషప్ సీమన్



జాతరను ప్రారంభిస్తున్న బిషప్ సీమన్

ధారూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ధారూరు మెథడిస్టు జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని దోర్నాల్, ధారూరు స్టేషన్ గ్రామాల మధ్య కాగ్నా నది పక్కన మంగళవారం నుంచి 16వ తేదీ వరకు జాతర కొనసాగనుంది. హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ బిషప్ సీమన్ ప్రధాన ద్వారం వద్ద రిబ్బన్ కట్ చేసి జాతరను ప్రారంభించారు. అనంతరం ముఖ ద్వారం పక్కన ఉన్న ఏసు ప్రభువు శిలువ వద్ద బిషప్ ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తి పాటలు పాడుతూ ప్రధాన వేదిక వద్ద ఉన్న ఏసు ప్రభువు శిలువ వరకు ఊరేగింపుగా వెళ్లారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కాగా, అంతకు ముందు బిషప్ సీమన్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వేదికపై నుంచి బిషప్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఉత్సవాలలో భజన బృందాలు ఏసు ప్రభువు పాటలు, కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో జాతర కార్యదర్శులు స్టీవెన్, పాల్ మధుకర్, కోశాధికారి సెబాస్టియన్, సభ్యుడు డి.మార్క్, పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు. కాగా, జాతర ప్రాంగణాన్ని ఎస్పీ నారాయణ రెడ్డి మంగళవారం సాయంత్రం సందర్శించారు. భక్తులకు అవసరమైన రక్షణ చర్యలపై పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. లక్షలాది మంది వచ్చే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జాతర ప్రాంగణంలో సీసీ కెమెరాలతో నిఘా పెట్టామని వివరించారు.



శామీర్‌పేట రైతు సహకార సంఘం వద్ద సీఈవోలు, సెక్రటరీలు

రైతు సహకార సంఘం భేష్

శామీర్‌పేటలో ఇతర రాష్ట్రాల సీఈవోలు, సెక్రటరీల పర్యటన

శామీర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట రైతు సహకార సంఘం సాధిస్తున్న అభివృద్ధి, పనితీరు, పాలకవర్గం చేస్తున్న ఉత్తమ సేవలు ఎంతో ఎంతో బాగున్నాయని పలు రాష్ట్రాల రైతు సహకార సంఘాల సీఈవోలు, సెక్రటరీలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం శామీర్‌పేటలోని రైతు సేవా సహకార సంఘాన్ని నాబార్డ్, ఏపీ సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన రైతు సహకార సంఘాల సీఈఓలు, సెక్రటరీలు తమ శిక్షణలో భాగంగా సందర్శించారు. శామీర్‌పేట రైతు సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి, డైరెక్టర్లు వారికి సొసైటీ సాధిస్తున్న వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. రైతు సహకార సంఘం నుంచి రైతులకు అందుతున్న ప్రయోజనాలు, రుణాలు, ఎరువులు, విత్తనాలు, డ్రోన్ల ద్వారా చేపట్టిన స్ప్రేయర్ పనులు, సీఎస్‌సీ సెంటర్ ద్వారా రైతులకు కల్పిస్తున్న ఆన్‌లైన్ సేవల గురించి చైర్మన్ వారికి వివరించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పీఏసీఎస్ సీఈఓలు మాట్లాడుతూ తమ రాష్ట్రాల్లో సంఘాలు చేపడుతున్న అభివృద్ధి పనులను, వ్యాపారాల గురించి వివరించారు. శామీర్‌పేట సంఘం సాధించిన అభివృద్ధి పనులను తాము ఆదర్శంగా తీసుకుని తమ రాష్ట్రాల్లో చేపడుతామని వారు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ అధికారులు శీలా, సతీష్, యోగేశ్, సొసైటీ డైరెక్టర్లు మ్యాకల ఐలయ్య, ముద్దం ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, ఆకుల చంద్రకళ, సీఈఓ నర్సింలు పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా అల్ బలాగ్ అనే పత్రికను ప్రారంభించి భారత జాతీయ వాదిగా పేరుగాంచారని తెలిపారు. ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం ద్వారా ముస్లిం సమాజంలో బ్రిటీష్ వ్యతిరేక భావాలు పెంపొందించి, అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్రోద్యమంలో పాల్గొనేలా కీలక పాత్ర పోషించారన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాలు సేవలందించిన మౌలానాకు మరణానంతరం 1992లో భారతరత్న పురస్కారం లభించిందన్నారు. విద్య లేకుండా దేశం అభివృద్ధి చెందదని, విద్య స్వాతంత్ర్యానికి రెండో రూపమని చెప్పిన మౌలానా, భారత విద్యా వ్యవస్థకు బలమైన పునాదులు వేసిన మహనీయుడని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌వో మంగీలాల్, ఏఓ పరహీన, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే చర్యలు

దుద్యాల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య అన్నారు. మంగళవారం దుద్యాల్ స్టేజీ వద్ద పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాల అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. తనిఖీల్లో 45 నంబర్ ప్లేట్ లేని వాహనాలు, సరైన పత్రాలు లేనివాటిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి పెద్దపీట

దుద్యాల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎక్కచెరువు తండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అన్ని గ్రామాలు, తండాల్లో అంగన్‌వాడీ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు శేఖర్, నర్సిములుగౌడ్, నాయకులు వెంకట్‌రాములుగౌడ్, సీతారాం, పులిందర్ రెడ్డి, మెరుగు వెంకటయ్య, రూప్లనాయక్ తదితరులు పాల్గొన్నారు.




అంగన్ వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ రాజేశ్‌రెడ్డి

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
ఏషియన్ తారకరామ 70 ఎంఎం - కాచిగూడ
అర్జున్ 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
భ్రమరాంబ - మల్లికార్జున కాంప్లెక్స్ - కూకట్‌పల్లి
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల




తాడ్బూర్లి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ ఆరాధన 70 ఎంఎం - తార్నాక
TRIPURA CREATIONS

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల



వెంకటసాయి 70 ఎంఎం ఎ/సి - కీసర
SKML MOTION PICTURES

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల



వెంకటసాయి 70 ఎంఎం ఎ/సి - కీసర
MG MOVIES 9989522999

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల
ADVANCE BOOKING OPENS



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
7.45,11.00,2.30,6.00,9.30
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల



ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల



BHAVAPRITA PRODUCTIONS 9030161717

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల




సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
హిందీ వర్షన్
Ganga Entertainments 9966963111

విజయవంతమైన 2వ వారం




సుదర్శన్ 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 1.30,6.00,10.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
హిందీ వర్షన్
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల



GANESH BHARI 9296509333



సంధ్య 70 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
హిందీ వర్షన్
GEETHA FILM DISTRIBUTORS

ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల



GANESH BHARI 9296509333

దాడుల్లో భారీగా నల్ల బెల్లం పట్టివేత

● 120 కిలోల బెల్లం, 120 కేజీల పటిక స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్టు ● ఆటో, రెండు సెల్‌ఫోన్ల సీజ్



పట్టుబడిన బెల్లం, పటిక, నిందితులతో సీఐ బద్యనాథ్ చౌహాన్, సిబ్బంది

ఆమనగల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సారా, నల్లబెల్లం, మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు ఉక్కు పాదం మోపుతున్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలో దాడులను ముమ్మరం చేశారు. మంగళవారం సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పెద్ద ఎత్తున బెల్లం, పటిక పట్టుకున్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ పరిధి గ్రామాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాలకు తయారీకి హైదరాబాద్ నుంచి నల్లబెల్లం, పటిక తరలిస్తున్నారన్న సమాచారంతో సీఐ నిఘా ఏర్పాటు చేశారు. కడ్తాల టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఆగి ఉన్న ఆటోను తనిఖీ చేయగా 120 కిలోల నల్లబెల్లం, 120 కిలోల పటిక పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఒక ఆటో, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసి, బెల్లం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు ఎం.ప్రవీణ్, ఎం. బీచ్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సారా తయారీ, విక్రయాలను అరికడుతున్నట్టు సీఐ బద్యనాథ్ చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది శంకర్, శ్రీను, బాబు, ఆమని పాల్గొన్నారు.

అక్రమ మద్యం ...

ఆదిభట్ల: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎస్వోటీ పోలీసులు పట్టుకున్న ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాదర్గుల్‌కు చెందిన మాదగోని అశోక్ బెల్టు షాపు విక్రయానికి రూ.25వేలు విలువ చేసే(పది బీర్లు, 38 లీటర్ల ఆఫీసర్ చాయిస్ 90ఎంఎల్) మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తుడగా మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు నాదర్గుల్ సబ్‌స్టేషన్ సమీపంలో పట్టుకున్నారన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..



షాబాద్‌లో దీక్ష చేస్తున్న బీసీ సంఘం నాయకులు

షాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకూ పోరాటం కొనసాగిస్తామని సంఘం నాయకులు మీసాల వెంకటయ్య, మాణిక్యం, రాజలింగం, శ్రీనివాస్ అన్నారు. షాబాద్‌లో చేపట్టిన దీక్ష మంగళవారంతో 31రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గౌరీశ్వర్, చంద్రయ్య, రమేశ్‌యాదవ్, శ్రీకాంత్, ప్రభాకర్‌గౌడ్, సత్తయ్య,జనార్దన్, మాజీద్, అన్వర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభుడి కోడెల వేలం



అనంతగిరిలో కోడె దూడల వేలాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది

వికారాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతగిరి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో మంగళవారం కోడె దూడల వేలాన్ని నిర్వహించారు. కార్తీక మాస పెద్ద జాతర సందర్భంగా స్వామి వారికి భక్తులు మొక్కుబడిగా చెల్లించిన కోడెలను వేలం వేశారు. మొత్తం 11 జతలను వేలానికి పెట్టగా ఐదు జతలను కొత్రేపల్లికి చెందిన జి.కృష్ణయ్య రూ.97వేలకు కొన్నాడు. మూడు జతలను గోదంగూడకు చెందిన జి.శంకరయ్యగౌడ్ రూ.30వేలకు, రెండు జతలను మున్నూర్ సోమారం గ్రామానికి చెందిన టి.రవి రూ.37,500కు, మరో జతను ఇదే గ్రామానికి చెందిన టి.దయాకర్ రూ.30వేలకు తీసుకున్నాడు. వేలం ద్వారా ఆలయానికి రూ.2.32లక్షల ఆదాయమొచ్చిందని ధర్మకర్త ఎన్.పద్మనాభం, ఈవో టి.నరేందర్ తెలిపారు.

లొంక క్షేత్రంలో ప్రత్యేక పూజలు

పరిగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లాపూర్ లొంక అంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆట, పాటలతో భజనలు, కోలాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగికి చెందిన డాక్టర్ ప్రదీప్‌కుమార్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



లొంక ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు

సామాజిక సంక్షేమాన్ని పెంపొందించాలి

● ఒకే వేదికపై ఇన్వెస్టర్లు, ఇనిస్టిట్యూషన్లు

● దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

● బాలవికాస కేంద్రంలో

సోషల్ స్టార్టప్ సమ్మిట్ ఇంపల్స్-2025



సోషల్ స్టార్టప్ సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ

కీసర, నవవబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలను రూపుమాపేందుకు సామాజిక వ్యాపార ఆలోచనలు అవసరమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి దాయరలోని బాల వికాస కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సోషల్ స్టార్టప్ సమ్మిట్ ఇంపల్స్-2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. బాల వికాస వ్యవస్థాపకులు బాల థెరిస్సా అంద్రే జింగ్రాస్‌తో కలిసి సమ్మిట్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఒకే వేదికపైకి సామాజిక వ్యాపార ఆలోచనలు ఉన్నవారిని, ఇన్వెస్టర్లను, వివిధ రంగాల సంస్థలను తీసుకురావడం గొప్ప విషయమన్నారు. సామాజిక సంక్షేమాన్ని పెంపొందించడంలో ప్రతీ ఒక్కరు ముందుండాలన్నారు. పెట్టుబడులకు సహాయ సహకారాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 7000 గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలతో సేవలందిస్తున్న బాల వికాస కేంద్ర నిర్వాహకులను అభినందించారు. తనకు గత 30ఏళ్లుగా బాల వికాస సంస్థతో మంచి సంబంధం ఉందన్నారు. పరిశ్రమలతో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రభుత్వం 36లక్షల మొక్కలు నాటామన్నారు. అనంతరం పలువురు రూపొందించిన స్టార్టప్‌లను ఆమె పరిశీలించారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు నరేశ్ ఎంపిక

పరిగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరుగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు పరిగి విద్యార్థి ఎంపికయ్యాడు. పరిగిలోని గురుకుల పాఠశాల విద్యార్థి డి.నరేశ్ ఇటీవల యాదాద్రి భువనగిరిలో జరిగిన అంతర్ జిల్లా పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి టీంకు ఎంపికయ్యాడు. ఈ నెల 13 నుంచి 17 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడు. నరేశ్‌ను ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి, పీడీ శ్రీధర్‌రెడ్డి, టీచర్లు అభినందించారు.



ట్రోఫీతో నరేశ్

రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

వికారాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):రద్దీ ప్రదేశాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఎస్పీ ఆదేశాల మేరకు బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు వికారాబాద్ రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తనిఖీలు చేశారు. ప్రజలతో మాట్లాడుతూ.. అనుమానిత వస్తువులుగానీ, వ్యక్తులుగానీ కన్పిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు గానీ లేదా డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.



బస్టాండ్‌లో..

రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీ విజేత రంగారెడ్డి

● ఉమ్మడి జిల్లా జట్టు రికార్డు



రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

శామీర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిథ్యం వహించిన తూంకుంట క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించారు. ఈ క్రీడా పోటీలు, విజేతల వివరాలను మంగళవారం ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. ఈ నెల నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు పెద్దపల్లిలో రాష్ట్ర స్థాయి 58వ సీనియర్ ఖోఖో టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా జట్టు మూడు రోజుల పాటు హోరాహోరీగా తలపడ్డారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా పురుష క్రీడాకారుల ప్రథమ స్థానంలో, మహిళల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించారు. ఉమ్మడి రంగారెడ్డి తరపున తూంకుంటకు చెందిన జైహింద్ ఖోఖో క్లబ్ నుంచి 8 మంది పురుష క్రీడాకారులు, ఒక క్రీడాకారిణి పాల్గొన్నారు. ఇటీవల తూంకుంటలో 10 రోజుల పాటు క్రీడాకారులకు నిర్వహించిన శిక్షణ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విజయానికి దోహద పడిందని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

విజేతలను అభినందించిన ఆర్గనైజర్లు, తల్లిదండ్రులు

కాగా రాష్ట్ర స్థాయిలో జరిగిన ఖోఖో క్రీడాపోటీల్లో ప్రథం స్థానంలో నిలిచిన తూంకుంట జైహింద్ ఖోఖో క్లబ్‌కు చెందిన క్రీడాకారులను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం ఉపాధ్యక్షుడు, కోచ్ గుర్రం సత్తిరెడ్డి, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌యాదవ్, తూంకుంట జెడ్పీ పాఠశాల హెచ్ఎం వెంకటరెడ్డి, ఉమ్మడి శామీర్‌పేట యూటీఎఫ్ అధ్యక్షుడు తిరుమలేశ్, రాష్ట్ర స్థాయి సీనియర్ క్రీడాకారులు రఘువర్ధన్‌గౌడ్, సందీప్‌గౌడ్, వినోద్‌కుమార్, సోమేశ్, తదితర క్రీడాకారులు అభినందించారు.

రైతులపై కేసులను ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న ప్రజలు, నాయకులు

దుద్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులపై కేసులను ఎత్తివేయాలని కొడంగల్ నియోజకవర్గ దుద్యాల మండలం లగచర్లలో మంగళవారం వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం 11న కలెక్టర్ ఇతర అధికారులపై జరిగిన దాడి నేపథ్యంలో హకీంపేట, లగచర్ల, పులిచర్ల,రోటిబండ తండాలు, పోలెపల్లి గ్రామాలకు చెందిన 72 మంది రైతులపై, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిలపై కేసుల నమోదుతో రైతులు బాధల్లో ఉన్నారన్నారు. కలెక్టరే తనపై దాడి జరగలేదని, దాడి అనే పదాన్నే వాడొద్దని చెప్పినా ప్రభుత్వం రైతులపై కేసులు నమోదు చేయించిందని ఆరోపించారు. రైతులను, మహిళా రైతులను చూడకుండా పోలీస్‌స్టేషన్‌ల చుట్టు తిప్పడం సరైంది కాదన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అధికారులు భూములు సేకరించడం జరిగిందని, కానీ కొంత మంది ఎస్టీ రైతులు, రైతులు భూములు ఇవ్వకుండా న్యాయం కోసం పోరాటం చేస్తున్నారన్నారు. భూములు ఇవ్వని రైతులను వెంటనే ఇండస్ట్రియల్ కారిడార్ నోటిఫికేషన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 38 మంది రైతులకు ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. హకీంపేట్‌కు చెందిన ర్యాకం యాదయ్యకు చెందిన సర్వే నం.240లో భూమికి జనరల్ అవార్డు ప్రకటించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నరేశ్‌గౌడ్, యాదయ్య, బసప్ప, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు సూర్యానాయక్, విశాల్, శివకుమార్, కిష్టప్ప, మదరయ్య పాల్గొన్నారు.

తెలంగాణలో పేదరికం పోలేదు

● త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా..

● తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



మాల్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కవిత

యాచారం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా ఇంకా పేదరిక నిర్మూలన జరగలేదని, రాష్ట్రంలో రాజకీయ శూన్యత నెలకొందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. జాగృతి నిర్వహిస్తున్న జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె మిర్యాలగూడ, నల్గొండ ప్రాంతాలకు వెళ్తుండగా మార్గమధ్యలో మాల్‌లో ఆమెకు జాగృతి కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కవిత మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి వ్యక్తి కృషిచేయాలన్నారు. బీఆర్ఎస్ నుంచి బయటకొచ్చినా తాను నిరుపేదల కడగండ్లు తీర్చే పోరాటానికి అంకితమైనట్లు వెల్లడించారు. సామాజిక తెలంగాణ నినాదంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. త్వరలో తన కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలందేలా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంజయ్య తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల దీక్ష



కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేస్తున్న పెన్షనర్లు

ఇబ్రహీంపట్నం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం కలెక్టరేట్ వద్ద తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు నిరసన దీక్ష చేపట్టారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణారావు మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ఎన్నో ఏళ్లుగా పరిష్కరించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 మార్చి 31తర్వాత రిటైరైన వారితోపాటు అంతకు ముందు విరమణ చేసిన వారిలో కొందరికి పెన్షన్ బెనిఫిట్లు ఇవ్వలేదన్నారు. పైరవీలు చేసుకున్న వారికే బెనిఫిట్లు అందుతున్నాయని ఆరోపించారు. పెన్షనర్లకు ఇచ్చిన హామీ మేరకు ఈహెచ్ఎస్ కార్డులతో నగదు రహిత వైద్యం అందించడం లేదని, వెంటనే ఈ స్కీం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన



మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను అందజేస్తున్న డీఆర్‌డీవో శ్రీలత

కడ్తాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించొచ్చని డీఆర్‌డీవో శ్రీలత అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కడ్తాల మండలం చల్లంపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు మారేళ్ల బాలమ్మ రూ.3 లక్షలతో ఏర్పాటు చేసుకున్న రెండు వేల కోడి పిల్లల పెరటి కోళ్ల యూనిట్‌ను మంగళవారం అదనపు డీఆర్‌డీవో బోజప్ప, డీపీఎం నర్సింహ, ఏపీఎం రాములుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శ్రీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తుందని పేర్కొన్నారు. పెరటి కోళ్లకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందున మహిళా సంఘాలు యూనిట్లు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి 20కోడి పిల్లల చొప్పున 100 మందికి రుణం ఇస్తామని తెలిపారు. అనంతరం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలు మీనాక్షి, సీసీ శ్రీలత, ధనలక్ష్మి, హైమవతి, నర్సింహ, సిబ్బంది విజేందర్, లక్ష్మి, జంగయ్య పాల్గొన్నారు.

టీ-శాట్ పాఠ్యాంశాలను సద్వినియోగం చేసుకోవాలి

● టీఎస్‌జీహెచ్‌ఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి

వికారాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీ-శాట్ నెట్‌వర్క్ ప్రసారం చేసే పాఠ్యాంశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్‌జీహెచ్‌ఎంఏ జిల్లాప్రధాన కార్యదర్శి కేశపల్లి రాంరెడ్డి సూచించారు. మంగళవారం టీ-శాట్ నెట్‌వర్క్, రాష్ట్ర గజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్(టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ఆధ్వర్యంలో జెడ్పీ బాలుర పాఠశాలలో వివిధ అంశాలపై జిల్లా స్థాయి వ్యాస రచన, బాలవక్త, క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి వ్యాస రచన, బాలవక్త, క్విజ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన 60 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, టీ-శాట్ ద్వారా ప్రసారమవుతున్న విద్యా విషయక కార్యక్రమాలను విద్యార్థులు వీక్షించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను రూపొందించారన్నారు. టీ-శాట్ నెట్‌వర్క్ ప్రసారం చేసే విద్యా విషయక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే టీ-శాట్ నెట్‌వర్క్, టీఎస్‌జీహెచ్‌ఎంఏ సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలను ప్రకటించారు. ఎంఈవో బాబూసింగ్, కొత్తగడి జీహెచ్‌ఎం వీరకాంతం, సబ్జెక్టుల నిపుణులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాంరెడ్డి

అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు



అందెశ్రీ అంత్యక్రియలకు హాజరైన సీఎం, మంత్రులు, నాయకులు

(ఐదోపేజీ తరువాయి)

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు పక్కన ఉన్న హెచ్ఎండీఏ స్థలంలో నిర్వహించిన అందెశ్రీ అంత్యక్రియలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అందెశ్రీ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ అంతిమ యాత్రలో దారిపొడవునా పూల జల్లుతో నివాళులు అర్పించారు. దాదాపు 500 మంది కళాకారులు అంతిమ యాత్రలో పాల్గొని పాటలతో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఘట్‌కేసర్ నుంచి ఎన్ఎఫ్‌సీనగర్ వెళ్లే రోడ్డుతో పాటు కాలనీల్లోని అందెశ్రీ ఇంటి వరకు గల రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అంతిమ యాత్రలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియెజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ముల్లి పావని, బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పలువురు ప్రముఖులు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.





అందెశ్రీ మృతి తీరని లోటు


అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శామీర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కవి అందెశ్రీ మృతి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తీరని లోటని తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మద్ అఫ్జల్‌ఖాన్ అన్నారు. శామీర్‌పేటలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మారెడ్డి, రాజు, మహ్మద్ గౌస్, మహ్మద్ నిసార్ అహ్మద్‌ఖాన్, మహ్మద్ అల్తాఫ్, విక్రమ్‌ప్రభు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్నా పట్టించుకోరా?

● శిథిలావస్థలో పాఠశాలల భవనాలు ● భయాందోళనలో విద్యార్థులు


పెచ్చులూడిన పోల్కంపల్లి పాఠశాల భవనం పైకప్పు


శిథిలావస్థలో గుమ్మడాల పాఠశాల భవనం

దౌల్తాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ప్రమాదకరంగా మారాయి. ప్రమాదకరంగా పాఠశాలలు ఉన్నా ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దౌల్తాబాద్ మండలంలోని పోల్కంపల్లి, గుమ్మడాల, కుప్పగిరి తదితర గ్రామాల్లో పాఠశాలల భవనాల పైకప్పు వర్షం పడితే చాలు పై నుంచి పెచ్చులూడి కింద పడుతున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను గుర్తించి మరమ్మతు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రజాప్రతినిధులు కడా కార్యాలయంలో వినతి పత్రాలు అందించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారిందని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. మంగళవారం కురిసిన వర్షానికి పోల్కంపల్లి, గుమ్మడాల గ్రామాల్లోని పాఠశాలల భవనాల పైకప్పు నుంచి పెచ్చులూడి పడటంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు హడావుడిగా సందర్శించడం తప్ప చేసిదేమి లేదనే విమర్శలు వెలువడుతున్నాయి.

అధ్వానంగా రోడ్లు


కోతకు గురైన గోడుగోనిపల్లి ప్రధాన రోడ్డు


అయినాపూర్ దగ్గర కోతకు గురైన బీటీరోడ్డు

దోమ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోడగోనిపల్లి, బాసుపల్లి, అయినాపూర్ గ్రామాల సమీపంలోని ప్రధానరోడ్లు భారీవర్షాలకు కోతకు గురయ్యాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోతకు గురైన రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. పరిగి నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన బీటీరోడ్డుపై వాహనదారులు, బాటసారులు ఆదమరిస్తే అంతే సంగతులని పలువురు గ్రామస్థులు, వాహనదారులు వాపోయారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన కల్వర్టుల వద్ద అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మర్పల్లి: మండలంలోని పలుగ్రామాల ప్రధాన రోడ్లు భారీ వర్షాలకు అధ్వానంగా మారాయి. రోడ్లపై పెద్దగుంతలు ఏర్పడటంతో వర్షపునీరు నిలిచి ఉండటంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. మండలంలోని రావుల్‌పల్లి, కల్కోడ, దామస్తాపూర్, మర్పల్లి, పట్లూర్, పంచలింగాల, సిరిపూరం, కొత్లాపూరం, మొగిలిగుండ్ల తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతల్లో వర్షపునీరు నిలిచి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోయారు. ఇప్పటికైనా మండలంలో అధ్వానంగా మారినరోడ్లను గుర్తించి మరమ్మతు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు మరమ్మతులు చేపట్టాలి



దోమ మండలంలో భారీ వర్షాలకు ప్రధాన రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పాలకులు, అధికారులు కనీస మరమ్మతులు చేయకపోవడం సరైంది కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధ్వానంగా మారిన రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి.

- గోవర్ధన్ ముదిరాజ్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు


కొల్లాపూరం రోడ్డు దుస్థితి

బాలికల భద్రతే షీటీం లక్ష్యం


మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికల భద్రతే షీటీం లక్ష్యమని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కరన్‌కోట్ గ్రామంలోని సీసీ కాలనీలో మంగళవారం డీఏవీ పాఠశాలలో షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నచిన్న విషయాలకు ఆందోళనకు గురికావొద్దన్నారు. మంచి ఆలోచనతో చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో కానీ, బయట ఎక్కడైనా ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడినా వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 100, 181కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలికలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. క్రమశిక్షణతో ఉండేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ ఇన్‌చార్జి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


పీరంపల్లి భజన భక్తులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ రాధిక సోమలింగం

కులకచర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పీరంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాధిక సోమలింగం అన్నారు. కార్తీకమాసం సందర్భంగా గ్రామ భక్త ఆంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో ప్రతీరోజు గ్రామంలోని ఒకరి ఇంట్లో కార్తీక భజన నిర్వహిస్తున్నారు. భజనభక్తులు పెద్దఎత్తున పాల్గొని రాత్రి సమయంలో భజనలు చేస్తున్నారు. సోమవారం రాత్రి భజనలో పాల్గొన్న భక్తులను మాజీసర్పంచ్ రాధిక సోమలింగం సన్మానించి మాట్లాడారు. ప్రతీఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మునిరంగడు మృతదేహం

మోమిన్‌పేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మోమిన్‌పేట్ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూల్ జిల్లా దేవరకొండ మండలం నేలతలమారికి చెందిన మునిరంగడు(35) తన అన్న రామకృష్ణతో కలిసి మోమిన్‌పేట్ మండలంలోని గోవిందాపూర్‌లో ఓ ఫామ్‌హౌస్‌లో కుటుంబంతో కలిసి గత సంవత్సరం నుంచి కూలీపనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. సోమవారం రాత్రి వేట కోసం ఇంటి నుంచి బయల్దేరారు. ఈ క్రమంలో గోవిందాపూర్ గ్రామ పరిధిలోని యూసుఫ్‌కు చెందిన సర్వే నంబరు 68 వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంట చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు కాళ్లు తగిలి మునిరంగడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ వ్యవసాయ పొలాన్ని ఎన్కతల గ్రామానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడని తెలిసింది. ఈ ఘటనపై మృతుడు మునిరంగడు అన్న రామకృష్ణ మంగళవారం మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా విద్యుత్‌ను పొలాల చుట్టూ ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని, నాన్‌బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

పెళ్లి సంబంధాలు కుదరడంలేదని యువకుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పెళ్లి సంబంధాలు కుదరడంలేదని ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా, ఆత్మకూర్‌కు చెందిన బోర సురేష్ కుమారుడు బోర నరేష్‌గౌడ్(30) నగరంలోని అమీర్‌పేట్‌లోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. నాలుగైదు సంవత్సరాల నుంచి నరేష్‌కు ఇంట్లోవారు పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరడం లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నరేష్ గౌడ్ మంగళవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలోని మాదవరెడ్డి వంతెన సమీపంలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లోకల్ పైలట్ సమాచారం మేరకు రైల్వేపోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఫోన్ ఆధారంగా అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పెళ్లి సంబంధాలు కుదరకపోవడం వల్లే నరేష్ తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

● హార్వెస్టర్ తరలింపు విషయంలో గొడవ
● రాళ్లు, కొడవళ్లు, కర్రలతో దాడులు ● తొమ్మిది మందిపై కేసు

దోమ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హార్వెస్టర్ మిషన్ తరలింపు విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగి దాడులకు పాల్పడ్డాయి. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొట్లచెల్క తండాకు చెందిన అంగోత్ సురేశ్ తన వ్యవసాయ పొలంలో వరికోత కోసం తండా నుంచి హార్వేస్టర్‌ను పొలానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈక్రమంలో అదేతండాకు చెందిన అంగోత్ గోబ్రిబాయి ఇంటి ముందు నుంచి తీసుకెళ్తున్న హార్వేస్టర్‌ను ఆమె కోడలు అరుణతో కలిసి అడ్డుకుంది. దీంతో ఆక్రోశానికి గురైన సురేశ్ తండ్రి గేమ్యు వారితో వాగ్వాదానికి దిగాడు. ఇరువర్గాలు ఘర్షణకు తెర లేపగా అంగోత్ గోబ్రిబాయి, ఆమె కోడలుపై గేమ్యు అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న అంగోత్ గోబ్రిబాయి కుమారుడు రవి వరికోత మిషన్ తీసుకెళ్తున్న సురేశ్, అడ్డువచ్చిన అతని తండ్రి గేమ్యనాయక్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రవి భార్య అరుణకు తీవ్రగాయాలు కాగా, సురేశ్, గేమ్యకు గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని స్థానికులు పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువర్గాలు రాళ్లు, కొడవళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు మంగళవారం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వసంత్‌జాదవ్ తెలిపారు.

రేకుల డబ్బాలో మంటలు

● కూలర్లు, మిక్సీలు దగ్ధం


దగ్ధమైన కూలర్లు, మిక్సీలు

తాండూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం భవానీనగర్‌లో ఫజల్ అనే వ్యక్తి తన ఇంటి పక్కన ఉన్న రేకులషెడ్డు డబ్బాలో మార్కెట్‌లో విక్రయించే కూలర్లు, మిక్సీలను పెట్టారు. మంగళవారం చెత్త ఊడ్చే ఒక పారిశుధ్య కార్మికురాలు డబ్బా వద్ద ఉన్న చెత్తను పోగుచేసి నిప్పుపెట్టి వెళ్లిపోయింది. దీంతో మంటలు ఒక్కసారిగా డబ్బాలోకి వెళ్లి దగ్ధమయ్యాయి. కాలనీవాసులు గమనించి బోర్ల పైపుల ద్వారా మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.60వేల వరకు నష్టం వాటిల్లిందని యజమాని ఫజల్ చెప్పారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా సెంట్రింగ్ ఇన్‌స్పెక్టర్‌లను విచారణకు పంపించారు.

మక్కలకు ఆన్‌లైన్ తిప్పలు

(ఐదో పేజీ తరువాయి)

రైతులు ఉండగా, మొత్తం 75 వేల మెట్రిక్ టన్నుల మక్కలు విక్రయాలకు రావచ్చునని మార్క్‌ఫెడ్ అంచనా వేసింది. గతేడాది కనీస మద్దతు ధర కంటే మార్కెట్‌లో మక్కల ధరలు ఆశాజనకంగా ఉండటంతో ప్రభుత్వరంగ సంస్థలు మక్కల కొనుగోలుకు ముందుకు రాని విషయం తెలిసిందే. దీంతో ఇప్పుడు మక్కలు విక్రయించే రైతులకు గన్నీ బ్యాగులు కూడా ముందుగానే ఇవ్వనున్నారు. వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదు కాని మక్క రైతుల పేర్లు నమోదు చేసుకోవడానికి రాష్ట్ర స్థాయి కమిషనర్ వ్యవసాయ శాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మక్కలు విక్రయించే రైతులు తమ పేరు నమోదైన వారే డీసీఎంఎస్‌కు వేలిముద్ర వేశాక రైతు వివరాలు, ఎన్ని ఎకరాల్లో మక్కలు పండించారు అనేది తెలియనుంది. అలాగే సర్వే నంబర్, ఏ గ్రామ రైతు వివరాలు వచ్చిన తర్వాతనే మక్కలు కొనుగోలు చేయనున్నారు.

మీసేవలోనే దరఖాస్తు చేసుకోవాలి

దోమ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులను మీసేవ కేంద్రాల్లోనే నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గోవిందమ్మ తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ.. ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులు కొన్ని సర్టిఫికెట్ల విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. కుల, ఆదాయ సర్టిఫికెట్లతో పాటు భూరిజిస్ట్రేషన్, మిస్సింగ్, ఈసీలు తదితర సర్టిఫికెట్లను మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎంపీడీవోగా విశ్వప్రసాద్ బాధ్యతల స్వీకరణ

బషీరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విశ్వప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి రెగ్యూలర్ ఎంపీడీవో తిరుమలస్వామి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్‌కు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి


వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వ మద్దతుధర ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మెట్లకుంట, లగచర్ల, దుద్యాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ మద్దతుధరతో పాటు రూ.500 బోనస్ క్వింటాలుకు అందించనున్నట్లు తెలిపారు. కేంద్రాల నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్‌పాష, తహసీల్దార్ కిషన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, ఆవుటి శేఖర్, వెంకట్రాములుగౌడ్, మెరుగు వెంకటయ్య, రాంచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, డైరెక్టర్ మల్లేశ్, ఏఈవో శ్రీవాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. రైతులు ఆరబోసి, ఎండబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్‌నాయక్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శేఖర్, నర్సింహులుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ వెంకట్రాములుగౌడ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, మెరుగు వెంకటయ్య పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి


అబుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మైనారిటీ నాయకులు


తాండూరు రూరల్: అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు

కొడంగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మైనారిటీ నాయకుడు ఎస్ఎం.గౌసన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొడంగల్‌లో మంగళవారం కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాహేద్ హసేన్, మొహ్మద్ రహీం, మొహ్మద్ నసీర్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: విద్యతోనే కుటుంబం, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవాన్ని కళాశాల ఐ.క్యూ. ఏసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రఫియాఖానం, ఐ.క్యూ. ఏసీ సమన్వయ కర్త టి.రాంబాబు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూర్ రూరల్: మండలంలోని జినుగుర్తి మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం మౌలానా అబుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాండూరు నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ మతిన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా ప్రతీ ఒక్కరికీ విద్య అందాలని ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, మైనారిటీ పట్టణ అధ్యక్షురాలు రిజ్వానా బేగం, యూత్ అధ్యక్షుడు యాసర్, జగదీశ్, ప్రిన్సిపాల్ వినోద్‌ఖన్న, వార్డన్ సమీర్, ఉపాధ్యాయులు మహబూబ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్: మండలంలోని చిలుముల్‌మైలారం గ్రామంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కొడంగల్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, ఉపాధ్యక్షుడు సిరాజ్, అతీఖ్, పాఠశాల సిబ్బంది ఖాజ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి


ఆజాద్ జయంతిలో ఉపాధ్యాయులు, నాయకులు

విద్యతోనే సమాజం అభివృద్ధి

(ఐదో పేజీ తరువాయి)

అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, కళాశాల ప్రిన్సిపాల్ మహబూబా ఫాతిమా, మైనార్టీ నాయకులు మహమ్మద్ హాఫిజ్, వహీద్, ఆశం, మాజీ మునిసిప్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపునకు వారంతా ఇప్పుడు సంక్షేమ పథకాలు చేరవేయాలని ప్రతిపక్షాలకు దీటైన సమాధానం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ జాతీయ నాయకుడు కల్కోంద సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుద్యాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుద్యాల సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం(నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అర్జున్‌కుమార్, ఏఈ ఆనంద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు హస్నాబాద్, ఆలేడ్, అల్లిఖాన్‌పల్లి, లగచర్ల గ్రామాల్లో ఇవాళ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్

కులకచర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన బాలుర గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ వెంకటయ్య, ఏఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దౌల్తాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 175మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 34 మందికి ఆపరేషన్ అవసరం ఉండటంతో శంకర కంటి ఆస్పత్రి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రఫీ, వైద్య, సెర్ప్ సిబ్బంది వెంకన్న, హరినారాయణ, జయమ్మ, సరోజ పాల్గొన్నారు.

ST.JUDE'S COLLEGE OF EDUCATION FOR WOMEN
Approved by NCTE, affiliated to Osmania University,
Near Cattle Market, Vikarabad Dist. Telangana.
Ph.no:9640521132, 9492527862
Applications are invited for the post of lecturers in all subjects of B.Ed course
QUALIFICATION: Concerned subject PG and M.Ed with 55% of marks in both the PGs, NET or SLET or PhD is essential.
Apply with your Xerox copies of YOUR QUALIFIED CERTIFICATES to the above address within one week.
Sd/-Correspondent